సాక్షి కర్నూలు

సోమవారం : 3 : ఏప్రిల్ : 2023



అలరించిన నృత్యప్రదర్శన

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిత్యకళారాధనలో భాగంగా నిర్వహిస్తున్న సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం సంప్రదాయ నృత్యం భక్తులను అలరించింది.



డిజిటల్ సేవలు..పరుగులు

అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, కార్యకర్తలకు రాష్ట్ర ప్రభుత్వం స్మార్ట్ ఫోన్లు ఇచ్చింది. దీంతో అంగన్‌వాడీ కేంద్రాల్లో డిజిటల్ సేవలు పరుగులు పెడుతున్నాయి.

8లో



ఆధ్యాత్మిక తోవలో..

ఎండలు మండుతున్నాయి. రోజురోజుకు ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. ప్రతికూల పరిస్థితుల్లోనూ చిన్నారులు రంజాన్ ఉపవాసం ఉంటున్నారు. ఐదు పూటలా నమాజు చేస్తున్నారు.

8లో

రంజాన్ వేళలు

	ఇఫ్తార్	సహెర్
కర్నూలు	సా॥ 6:36	ఉ॥ 4:48
ఆదోని	సా॥ 6:39	ఉ॥ 4:51
నంద్యాల	సా॥ 6:35	ఉ॥ 4:45
ఆత్మకూరు	సా॥ 6:34	ఉ॥ 4:46
బనగానపల్లె	సా॥ 6:37	ఉ॥ 4:46

హదీస్ వెలుగు :

'ఈ లోకంలో అమ్మ ప్రేమను మించినది లేదు. కానీ అల్లాహ్ ప్రేమ ఒక అమ్మ ప్రేమ కంటే డెబ్బై రెట్లు అధికంగా ఉంటుంది.'

– పవిత్ర గ్రంథం ఖురాన్

టీడీపీ ఇక భూస్థాపితమే

- 14 ఏళ్ల పాలనలో చంద్రబాబు వాల్మీకులకు చేసింది శూన్యం
- వాల్మీకులకు 105 పదవులు ఇచ్చి గౌరవించిన సీఎం వైఎస్ జగన్
- ఎన్ని అడ్డంకులు సృష్టించినా అసెంబ్లీలో ఎస్టీలుగా గుర్తిస్తూ తీర్మానం
- మరోసారి వైఎస్ జగన్‌ను ముఖ్యమంత్రిని చేసి రుణం తీర్చుకుందాం
- వాల్మీకుల కృతజ్ఞతా ర్యాలీలో రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం



మాట్లాడుతున్న మంత్రి గుమ్మనూరు, చిత్రంలో మేయర్ రామయ్య, ఎమ్మెల్సీ మధుసూదన్ తదితరులు

కర్నూలు(అర్బన్): రాష్ట్రంలో 2024లో జరగనున్న శాసనసభ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ భూస్థాపితం కావడం ఖాయమని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం అన్నారు. వాల్మీకులను ఎస్టీలుగా గుర్తిస్తూ రాష్ట్ర అసెంబ్లీలో తీర్మానం చేయడంతో ఆదివారం కర్నూలులో వాల్మీకులు కృతజ్ఞతా ర్యాలీని నిర్వహించారు. జిల్లా పరిషత్ నుంచి జీజీ హాస్పిటల్ ఎదురుగా ఉన్న మహర్షి వాల్మీకి విగ్రహం వరకు పెద్ద సంఖ్యలో ప్రదర్శన జరిపారు, ఈ కార్యక్రమంలో మంత్రి గుమ్మనూరుతో పాటు ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షులు, నగర మేయర్ బీవై రామయ్య, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎం సుభాష్ చంద్రబోస్, ఆదోని మున్సిపల్ చైర్మన్ బోయ శాంతి పాల్గొన్నారు. ముందుగా మహర్షి వాల్మీకి విగ్రహానికి నేతలు పూలమాలలు వేసి పూజలు నిర్వహించారు. అనంతరం ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఫ్లెక్సీకి పాలాభిషేకం చేసి తమ కృతజ్ఞతను చాటుకున్నారు. ఈ సందర్భంగా అక్కడే ఏర్పాటు చేసిన సభలో మంత్రి గుమ్మనూరు జయరాం మాట్లాడుతూ.. వాల్మీకులను ఎస్టీలుగా గుర్తించవద్దని సీఎం వైఎస్ జగన్‌పై పలువురు నేతలు ఒత్తిళ్లు తీసుకువచ్చారన్నారు. వారి ఒత్తిళ్లను కూడా లెక్కచేయకుండా ''నేను మాట ఇచ్చాను .. ఎస్టీలుగా గుర్తిస్తూ తీర్మానం చేస్తాం ... ఇందులో వెనక్కి తగ్గే ప్రసక్తే లేదు'' అని ముఖ్యమంత్రి సాహసోపేతమైన నిర్ణయం తీసుకున్నారన్నారు. వాల్మీకులంటే వైఎస్ జగన్‌కు ఎంతో ప్రేమ, అభిమానమని, 105 పదవులు ఇచ్చి గౌరవించారన్నారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్ జగన్‌ను అఖండ మెజారిటీతో గెలిపించి మరోసారి సీఎంను చేసి రుణం తీర్చుకుంటామన్నారు.



సభకు హాజరైన వాల్మీకులు

జగన్ వెంటే వాల్మీకులు

వాల్మీకుల గురించి గతంలో ఏ ప్రభుత్వాలు పట్టించుకున్న పాపాన పోలేదని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షులు, నగర మేయర్ బీవై రామయ్య అన్నారు. పాదయాత్రలో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న వాల్మీకుల స్థితిగతులను స్వయంగా చూసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ నాడు ఇచ్చిన మాట ప్రకారం వాల్మీకులను ఎస్టీలుగా గుర్తిస్తూ అసెంబ్లీలో తీర్మానం చేశారన్నారు. వాల్మీకుల ఆరాధ్య దైవంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ చరిత్రలో నిలిచిపోతున్నారన్నారు. కులవృత్తి లేని వాల్మీకులను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఏకసభ్య కమిషన్ నివేదికల ఆధారంగా నిర్ణయం తీసుకున్నారన్నారు. నాలుగు సంవత్సరాల పాలనలోనే వాల్మీకులకు ఇంత చేసిన జగన్ 30 ఏళ్లు అధికారంలో ఉంటే మరెంతో చేస్తారన్నారు.

రుణపడి ఉంటాం

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు వాల్మీకులందరూ రుణపడి ఉంటారని ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్ అన్నారు. అనేక సంవత్సరాలుగా వివిధ రూపాల్లో పోరాటాలు చేసినా ఎవరూ పట్టించుకోలేదన్నారు. వాల్మీకుల స్థితిగతులను కళ్లారా చూసిన సీఎం వైస్ జగన్ అనేక నిర్ణయాలు తీసుకుంటున్నారన్నారు.

జగన్ సైన్యంగా ఉంటాం

రానున్న ఎన్నికల్లో రాయలసీమలోని వాల్మీకులందరూ వైఎస్ జగన్‌కు సైన్యంగా ఉంటామని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సుభాష్ చంద్రబోస్ అన్నారు. అసెంబ్లీలో చేసిన ఎస్టీ తీర్మానం పార్లమెంట్‌లో చట్టబద్ధత కల్పించేందుకు ముఖ్యమంత్రి కృషి చేస్తారన్నారు. వీఆర్‌పీఎస్ ఆధ్వర్యంలో ఢిల్లీ స్థాయిలో చేపట్టనున్న ఉద్యమాలకు అందరూ సహకరించాలన్నారు. కార్యక్రమంలో మంత్రి గుమ్మనూరు సోదరులు శ్రీనివాసులు, నారాయణస్వామి, చిప్పగిరి జెడ్పీటీసీ సభ్యుడు విరుపాక్షి, మాజీ జెడ్పీటీసీ సభ్యులు ఎల్ వెంకటేశ్వర్లు, జీరాంభీంనాయుడు, వెంకాయపల్లె ఆలయ చైర్మన్ బేతం కృష్ణుడు తదితరులు పాల్గొన్నారు.

వాల్మీకుల్లో జోష్

రాష్ట్ర అసెంబ్లీలో మార్చి 24న వాల్మీకులను ఎస్టీలుగా గుర్తిస్తూ చేసిన తీర్మానంపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు చెప్పేందుకు నిర్వహించిన కార్యక్రమం ఆదివారం కర్నూలులో సందడిగా సాగింది. నంద్యాల, కర్నూలు జిల్లాల నుంచి భారీ సంఖ్యలో వాల్మీకులు ఉదయం 10 గంటలకే జిల్లా పరిషత్‌కు చేరుకున్నారు. అందరికంటే ముందుగా నగర మాజీ మేయర్ బంగి అనంతయ్య ఒంటెపై కూర్చొని తన అనుచరులతో పెద్ద పెద్ద వైఎస్సార్‌సీపీ జెండాలతో ప్రదర్శనలో పాల్గొన్నారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎం సుభాష్ చంద్రబోస్ స్థానిక ఎస్‌బీఐ సర్కిల్‌లో ఉన్న వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం ముఖ్యమంత్రి వైఎస్ జగన్ కటౌట్లతో ఆటోల ర్యాలీ నిర్వహించారు. వాల్మీకి సామాజిక వర్గానికి చెందిన రమణ .. మహర్షి వాల్మీకి వేషధారణతో కార్యక్రమంలో పాల్గొని అందరినీ ఆకట్టుకున్నారు. జిల్లా పరిషత్ కార్యాలయం నుంచి ప్రారంభమైన కృతజ్ఞత ర్యాలీలో వైఎస్సార్ సీపీ, కాషాయ జెండాలు రెపరెపలాడాయి. ప్రదర్శనలో వైఎస్ జగన్ జిందాబాద్ అనే నినాదాలు హోరెత్తాయి. ఎండను లెక్కచేయకుండా ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటలకు కార్యక్రమం ముగిసేంతవరకు వాల్మీకులు నిబద్ధతతో ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.



సీఎం వైఎస్ జగన్ కటౌట్‌తో ప్రదర్శన

న్యూస్‌రీల్

శస్త్రచికిత్సల కోసం సీఆర్మ్ మిషన్లు



ఆసుపత్రికి వచ్చిన సీఆర్మ్ మిషన్

కర్నూలు(హాస్పిటల్): శస్త్రచికిత్సలను కచ్చితత్వంతో నిర్వహించేందుకు కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు రాష్ట్ర ప్రభుత్వం నాలుగు అధునాతన సీ ఆర్మ్ మిషన్లను పంపించింది. ఒక్కొక్కటి రూ.18లక్షల విలువజేసే ఈ మిషన్లు ఇప్పటికే రెండు ఆసుపత్రికి చేరుకున్నాయి. వీటిని న్యూరోసర్జరీ, ఆర్థోపెడిక్ ఆపరేషన్ థియేటర్లలో అమరుస్తున్నారు. మరో రెండు ఈ వారంలో రానున్నాయి. వీటిని ఒకటి అత్యవసర ఆపరేషన్ థియేటర్‌లో, మరొకటి న్యూరోసర్జరి ఓటీలోనే ఉంచనున్నట్లు సమాచారం.

10 వరకు ఎల్లెల్సీకి నీరు



తుంగభద్ర దిగువ కాలువ

హొళగుంద: తుంగభద్ర దిగువ కాలువకు ఈ నెల 10వ తేదీ వరకు నీరు విడుదల కానున్నాయి. ఆ తరువాత సరఫరాను పూర్తిగా నిలిపివేయనున్నారు. తుంగభద్ర జలాశయంలో ఆదివారం ఉదయం సమయానికి 7.088 టీఎంసీల నీరు మాత్రమే నిల్వ ఉంది. జిల్లాకు సంబంధించి ఎల్లెల్సీ 250 కి.మీ వద్ద 400 క్యూసెక్కుల ప్రవాహం కొనసాగుతోంది.

సామాజిక చైతన్యమే సాహిత్య లక్ష్యం



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సాహితీ వేత్తలు

కర్నూలు కల్చరల్: సామాజిక చైతన్యమే సాహిత్యం లక్ష్యమని రచయితలు పాలగిరి విశ్వప్రసాద్, తవ్వా ఓబుల్‌రెడ్డి అన్నారు. ప్రముఖ కథా రచయిత డాక్టర్ ఎం.హరికిషన్ రచించిన 'కథా స్రవంతి' పుస్తకావిష్కరణ కార్యక్రమం ఆదివారం సీక్యాంప్ కళాక్షేత్రంలో జరిగింది. అభ్యుదయ రచయితల సంఘం అధ్యక్షులు కలం ప్రహ్లాద అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో సాహితీ స్రవంతి కార్యదర్శి జంధ్యాల రఘుబాబు, అరసం నంద్యాల జిల్లా కన్వీనర్ ముర్తుజా, కళాక్షేత్రం అధ్యక్షులు పత్తి ఓబులయ్య, రచయితలు డాక్టర్ చంద్రమౌళిని, డాక్టర్ హనుమంతప్ప, పుల్లా రామాంజనేయులు, మురళి, వెంకటకృష్ణ, మారుతి, అజీజ్ తదితరులు పాల్గొన్నారు.

5న జగ్జీవన్‌రామ్ జయంతి



సమీక్ష నిర్వహిస్తున్న డీఆర్వో నాగేశ్వరరావు

కర్నూలు(సెంట్రల్): దళితనేత జగ్జీవన్‌రామ్ జయంతిని ఈ నెల 5వ తేదీన ఘనంగా నిర్వహించేందుకు ప్రజా సంఘాలు సహకారం అందించాలని డీఆర్వో ఎస్వీ నాగేశ్వరరావు కోరారు. ఆదివారం ఆయన తన కార్యాలయంలో వివిధ సంఘాల నాయకులతో జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకల నిర్వహణపై చర్చించారు. అన్ని ప్రజా సంఘాల నాయకులు మాట్లాడేందుకు అవకాశం కల్పించాలని కోరగా సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో డీఎస్‌డబ్ల్యూఓ రామ్‌ప్రతాప్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకుడు సీహెచ్ మద్దయ్య తదితరులు పాల్గొన్నారు.

ఊరూరా 'ఉపాధి' వికాసం

- 2022-23లో 91.56 లక్షల పనిదినాలు పూర్తి
- వేతనాల కింద రూ.209.16 కోట్లు చెల్లింపు
- మెటీరియల్ కాంపోనెంటు కింద 99.15 కోట్ల వ్యయం
- ఉపాధి పనుల్లో పత్తికొండ క్లస్టర్‌కు మొదటిస్థానం

కర్నూలు(అగ్రికల్చర్): జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం చిన్న, సన్నకారు రైతులు, వ్యవసాయ కూలీలకు ఎంతో ఊరట నిచ్చింది. గత ఏడాది (2022-2023)ఈ పథకం కింద రూ.308.31 కోట్లు వినియోగించారు. జిల్లా విభజన తర్వాత 2022-23లో ఉపాధిలో సాధించిన ప్రగతిని జిల్లా నీటి యాజమాన్య సంస్థ అధికారులు విడుదల చేశారు. 2022-23లో గ్రామీణాభివృద్ధి శాఖ జిల్లాకు 93 లక్షల పనిదినాలు కేటాయించింది. మొత్తంగా 91.56 లక్షల పని దినాలు కల్పించి 98.64 శాతం ప్రగతి సాధించారు. ఫీల్డ్ అసిస్టెంటు నుంచి ప్రాజెక్టు డైరెక్టర్ వరకు ప్రతి ఒక్కరూ జవాబుదారీతనంతో పని చేశారు. టీడీపీ హయాంలో 2018-19లో 62.35 లక్షల కుటుంబాలకు మాత్రమే పనులు కల్పించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత 2019-20 నుంచి ఉపాధి పనులను పకడ్బందీగా నిర్వహిస్తున్నారు. 2019-20లో 67.49 లక్షల పనిదినాలు కల్పించారు. 2022-23 ఆర్థిక సంవత్సరం ముగిసే నాటికి 91.56 లక్షల పని దినాలు కల్పించి జిల్లా నీటియాజమాన్య సంస్థ రికార్డు సృష్టించింది.

కూలీలకు రూ.209.16 కోట్లు వేతనాలు...

2021-22లో ఉమ్మడి జిల్లా మొత్తంగా ఉపాధి కూలీలకు వేతనాల కింద రూ.310.90 కోట్లు చెల్లించారు. 2022-23లో విభజన తర్వాత ఏర్పడిన కర్నూలు జిల్లాలో ఉపాధి కూలీలకు వేజ్ కింద రూ.209.16 కోట్లు చెల్లించడం విశేషం. మెటీరియల్ కాంపోనెంట్ కింద రూ.99.15 కోట్లు ప్రకారం రూ.308.31 కోట్లు ఖర్చు చేశారు. ఉపాధి కూలీలకు సగటున రూ.226 ప్రకారం వేతనాలు లభించాయి. గ్రామ, గ్రామానా పనులు కల్పించడంతో జిల్లా నుంచి వలసలు తగ్గాయి.

2018-19 నుంచి ఉపాధి పనుల ప్రగతి ఇలా ఉంది..

సంవత్సరం	కల్పించిన పనిదినాలు(లక్షల్లో)
2018-19	62.35
2019-20	67.49
2020-21	84.71
2021-22	82.88
2022-23	91.56

పత్తికొండ క్లస్టర్ ప్రథమం

2022-23వ సంవత్సరంలో కూలీలకు పనులు కల్పించడంలో పత్తికొండ క్లస్టర్ మొదటిస్థానంలో నిలిచింది. అత్యధికంగా ఈ క్లస్టర్‌లో 21.39 లక్షల పనిదినాలు కల్పించారు. తుగ్గలి మండలంలో 7.69 లక్షల పనిదినాలకు గాను 8.48 లక్షల పనిదినాలు కల్పించారు. ఎమ్మిగనూరు క్లస్టర్‌లో 18.50 లక్షలు, ఆదోని క్లస్టర్‌లో 18.29 లక్షలు, కర్నూలు క్లస్టర్‌లో 17.34 లక్షలు, ఆలూరు క్లస్టర్‌లో 16.04 లక్షల పనిదినాలు కల్పించారు.



గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి పనులు

వలసలు తగ్గాయి

ఉపాధి పనులు పకడ్బందీగా నిర్వహించడంతో జిల్లాలో వలసలు తగ్గాయి. 2022-23లో వేజ్, మెటీరియల్ కింద రూ.308.31 కోట్లు ఖర్చు చేశాం. కాంపోనెంటు కింద ప్రభుత్వ భవనాల నిర్మాణంతోపాటు పండ్లతోటల అభివృద్ధికి చర్యలు తీసుకున్నాం.

– అమరనాథరెడ్డి,ప్రాజెక్టు డైరెక్టర్, డ్వామా

గతేడాది రూ.1,379.02 కోట్ల పెన్షన్ కానుక

- నేటి నుంచి ఏప్రిల్ నెల పింఛన్ల పంపిణీ

కర్నూలు(అగ్రికల్చర్): వైఎస్సార్ పెన్షన్ కానుక కింద గతేడాది(2022-23 ఆర్థిక సంవత్సరం) ఉమ్మడి కర్నూలు జిల్లాలో లబ్ధిదారులకు రాష్ట్ర ప్రభుత్వం రూ.1379.02 కోట్లు చెల్లించింది. పింఛన్ల కింద ఇంత భారీ మొత్తం చెల్లించిందంటే ప్రభుత్వానికి అవ్వాతాతల పట్ల ఎంతటి ప్రేమాభిమానాలు ఉన్నాయో స్పష్టమవుతోంది. ప్రతి నెలా 1వ తేదీ ఉదయం 5 గంటలకే గ్రామ, వార్డు వలంటీర్లు ఠంచన్‌గా ఫించన్‌దారుల ఇళ్లకు వెళ్లి పంపిణీ చేయడం విశేషం. గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో పింఛన్ల కోసం ఎదురుచూసే సంస్కృతిని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం సమూలంగా మార్చివేసింది. పింఛన్ల కోసం ఎదురు చూడకుండా ఇంటి దగ్గరకే వలంటీరును పంపి ఇస్తుండటం పట్ల అవ్వాతాతల ఆనందం అంతాఇంతా కాదు. పింఛన్ల కింద కర్నూలు జిల్లాలో 2022 ఏప్రిల్ నుంచి 2023 మార్చి నెల వరకు రూ.795.48 కోట్లు , నంద్యాల జిల్లాలో రూ.613.64 కోట్లు చెల్లించారు. 2023-24 సంవత్సరం మొదటి నెల అంటే ఏప్రిల్ నెల పింఛన్ల పంపిణీ ఈ నెల 3వ తేదీ నుంచి జరుగనుంది. కర్నూలు జిల్లాలో 2,38,192 మంది లబ్ధిదారులకు రూ.66,22,60,750, నంద్యాల జిల్లాలో 2,16,135 మంది లబ్ధిదారులకు రూ.59,65,03,000 పంపిణీ చేయనున్నారు. వార్డు, గ్రామ వెల్ఫేర్ అసిస్టెంట్లు బ్యాంకులకు వెళ్లి నగదు తీసుకొని వలంటీర్లకు ఇవ్వాల్సి ఉండడంతో సోమవారం కాస్త ఆలస్యంగా పంపిణీ మొదలవుతుందని అధికారులు తెలిపారు.

గతేడాది కర్నూలు, నంద్యాల జిల్లాలో నెలవారీగా పంపిణీ చేసిన పింఛన్ల మొత్తం(రూపాయల్లో)

నెల	కర్నూలు జిల్లా	నంద్యాల జిల్లా
ఏప్రిల్(ఉమ్మడి)	113,45,46,500	---
మే	59,45,78,000	53,72,74,000
జూన్	59,26,21,000	53,66,62,500
జూలై	59,16,37,500	53,38,95,500
ఆగస్టు	60,70,43,500	54,65,76,500
సెప్టెంబర్	60,85,87,500	54,64,88,000
అక్టోబరు	60,72,24,000	54,51,15,000
నవంబరు	60,58,95,500	54,31,47,500
డిసెంబరు	60,4195,000	54,18,60,500
జనవరి	67,67,48,250	60,47,83,250
ఫిబ్రవరి	66,65,92,750	60,07,93,500
మార్చి	66,51,32,750	59,87,75,500
	795,48,02,250	613,54,11,750

విజయీభవ!

- నేటి నుంచి పదో తరగతి పరీక్షలు ప్రారంభం
- జిల్లాలో 149 కేంద్రాల ఏర్పాటు
- హాజరుకానున్న 32,760 మంది విద్యార్థులు
- పరీక్ష కేంద్రాల చుట్టూ జిరాక్స్ సెంటర్ల మూత

కర్నూలు సిటీ: భవిష్యత్తుకు పునాది వేసుకునేందుకు పదో తరగతి విద్యార్థులు సిద్ధమయ్యారు. సోమవారం నుంచి పబ్లిక్ పరీక్షలు రాయనున్నారు. ఇందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. జిల్లాలో 149 కేంద్రాల్లో 490 ఉన్నత పాఠశాలలకు చెందిన 32,760 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారు. మొత్తం 149 మంది ముఖ్య పర్యవేక్షకులను, 149 మంది డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్లను, 1,645 మంది ఇన్విజిలేటర్లను నియమించారు. పరీక్ష కేంద్రాల్లో ఏ సెంటర్లు(పోలీసు స్టేషన్లకు దగ్గర ఉండేవి) 79, బి సెంటర్లు(పోలీసు స్టేషన్లకు 8కి.మీ లోపు ఉండేవి)54, సీ సెంటర్లు (పోలీసు స్టేషన్లకు 8 కి.మీకు పైగా ఉన్నవి)16 ఉన్నాయి. సీ సెంటర్లకు 16 మంది కస్టోడియన్లను నియమించారు. ఏడు ఫ్లయింగ్ స్క్వాడ్ టీఎంలను ఏర్పాటు చేశారు. పది సమస్యాత్మక పరీక్ష కేంద్రాలను గుర్తించి పకడ్బందీ ఏర్పాట్లు చేశారు. చూచిరాసినా, చిట్టీలతో చిక్కినా విద్యార్థితో పాటు ఇన్విజిలేటర్‌పై చర్యలు తీసుకుంటామని విద్యాశాఖ అధికారులు ఇప్పటికే ప్రకటించారు. పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని కల్పించారు.

విద్యార్థులకు సూచనలు ..

- పరీక్ష కేంద్రాలకు ఉదయం 8.30 గంటలకే చేరుకోవాలి. 8.45 గంటలకు కేంద్రాల్లోకి అనుమతించాక కేటాయించిన స్థానాల్లోనే కూర్చోవాలి.
- అవసరమైన పెన్నులు, పెన్సిల్, అదనంగా ఏర్పాటు చేసుకుని వెంట తెచ్చుకోవాలి.
- పరీక్ష కేంద్రంలోకి ఎలక్ట్రానిక్ పరికరాలు తీసుకెళ్లకూడదు.
- ఏదైనా ఆరోగ్య సమస్యలు తలెత్తిన వెంటనే ఇన్విజిలేటర్‌ను సంప్రదించాలి.
- స్కూల్ యూనిఫాం వేసుకుని రాకూడదు.
- ప్రశ్నపత్రం క్షుణ్ణంగా చదివిన తరువాతే ముందుగా తెలిసిన వాటికి సమాధానాలు రాయాలి.
- ఎలాంటి కొట్టివేతలు లేకుండా సమాధానాలు స్పష్టంగా రాయాలి.

ప్రశ్నపత్రంపై కోడ్..

పరీక్ష కేంద్రాల్లో ఫ్యాన్లు ఉండేలా చర్యలు తీసుకున్నారు. తాగునీటి సదుపాయం కల్పించారు. మరుగుదొడ్ల సమస్య లేకుండా ఏర్పాట్లు చేశారు. పరీక్ష కేంద్రాల చుట్టు పక్కల ప్రాంతాల్లో జిరాక్స్ సెంటర్లు మూసివేసేలా ఆదేశాలు ఇచ్చారు. ఈ ఏడాది ప్రశ్నపత్రం ఎక్కడైనా లీకేజీ అయినా అది ఏ కేంద్రం నుంచి బయటికి వచ్చిందో తెలుసుకునేందుకు వీలుగా ఏడు నంబర్లతో కూడిన కోడ్‌ను సరికొత్తగా చేర్చారు. కేంద్రాల్లో తాగునీరు అందించేందుకు వాటర్ బాయ్‌లను ఏర్పాటు చేసుకోకూడదు. అటెండర్లను సైతం ఆ కేంద్ర సీఎస్ నిర్ణయాన్ని బట్టి మాత్రమే ఏర్పాటు చేసుకోవాల్సి ఉంటుంది.



నందవరంలోని పరీక్ష కేంద్రంలో హాల్‌టికెట్ నంబర్లు వేసిన దృశ్యం

15 కేంద్రాల్లో ఓపెన్ స్కూల్ పరీక్షలు

ఓపెన్ స్కూల్ పరీక్షలకు జిల్లాలో 15 కేంద్రాలు ఏర్పాటు చేశారు. మధ్యాహ్నం 2.30 నుంచి 5.30 గంటల వరకు జరుగనున్న పది పరీక్షలకు 6 కేంద్రాలు, ఇంటర్మీడియెట్ పరీక్షలకు 9 కేంద్రాలు ఏర్పాటు చేశారు. పదో తరగతి పరీక్షలకు 1,254 మంది, ఇంటర్మీడియెట్ పరీక్షలకు 1,892 మంది హాజరుకానున్నారు.

ఒత్తిడి లేకుండా పరీక్షలు రాయాలి



ఎలాంటి ఒత్తిడి లేకుండా పరీక్షలు రాయాలని పదో తరగతి విద్యార్థులకు కలెక్టర్ కోటేశ్వరరావు సూచించారు. కస్తూర్బా గాంధీ విద్యాలయాలకు చెందిన విద్యార్థినులతో జూమ్‌కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్ మాట్లాడారు. ఆడ పిల్లల చదువు సమాజానికి చాలా ముఖ్యమన్నారు. పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించి తల్లిదండ్రులకు, గురువులకు, స్కూళ్లకు మంచి పేరు తీసుకురావాలన్నారు. జూమ్‌కాన్ఫరెన్స్‌లో సమగ్రశిక్ష అదనపు ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ వేణుగోపాల్, జీసీడీఓ సునీత, కేజీబీవీల ప్రిన్సిపాళ్లు పాల్గొన్నారు.

సెల్‌ఫోన్లు నిషేధం



మాట్లాడుతున్న జిల్లా అబ్జర్వర్ నరసింహారావు

పదో తరగతి పరీక్ష కేంద్రాల్లోకి సెల్‌ఫోన్లు తీసుకెళ్లకూడదని 'పది' పరీక్షల జిల్లా పరిశీలకులు నరసింహారావు సూచించారు. ఆదివారం డీఈఓ కార్యాలయంలో పరీక్షల నిర్వహణపై ఆయన స్క్వాడ్ బృందాలు, సిట్టింగ్ స్క్వాడ్ బృందాలతో సమీక్ష నిర్వహించారు. పరీక్షలు జరిగే సమయంలో కేంద్రాల్లోకి ఏ ఒక్కరినీ అనుమతించకూడదన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని తెలిపారు. మీడియా ప్రతినిధులను, పోలీసులను గేటు బయటే ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. వారికి ఏమైనా సమాచారం కావాలని కోరితే ఆయా కేంద్రంలోని సీఎస్ గేటు దగ్గరికి వచ్చి తెలియజేస్తారన్నారు. ప్రతి ఒక్కరినీ తనిఖీ చేసి పరీక్ష కేంద్రాల్లోకి పంపించాలన్నారు. అనుమానం వస్తేనే విద్యార్థిని తనిఖీ చేయాలని, అనవసరంగా తనిఖీల పేరుతో విద్యార్థులను ఇబ్బందులకు గురి చేయకూడదన్నారు. సమావేశంలో డీఈఓ రంగారెడ్డి, డైట్ లెక్చరర్ మువ్వా గోవిందు తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక తోవలో..

- రంజాన్ ఉపవాసాల్లో చిన్నారులు
- తల్లిదండ్రుల పర్యవేక్షణలో కొనసాగింపు

కర్నూలు(రాజ్‌విహార్): ముస్లింలకు రంజాన్ మాసం చాలా ప్రత్యేకం. ఈ నెలంతా వారు అల్లాహ్ ప్రార్థనల్లో గడుపుతారు. ఉపవాసాలు ఉంటారు. దీక్ష సమయంలో పచ్చి మంచినీరు కూడా ముట్టుకోరు. అల్లా కరుణ కోసం చేసే ఈ కఠోర దీక్షలను జిల్లాలో చిన్నారులు సైతం ఆచరిస్తున్నారు. తల్లిదండ్రుల పర్యవేక్షణలో ఈ ఉపవాసాలు కొనసాగిస్తూ ఆధ్యాత్మిక మార్గంలో పయనిస్తుండటం విశేషం.

రంజాన్ నెల చిన్నారుల్లో ఆధ్యాత్మికత నింపుతోంది. తలపై టోపీ ధరించి మసీదుకు వెళ్లి నమాజు చదవడమే కాక ఉపవాస దీక్షలు సైతం పాటించి భక్తిని చాటుకుంటున్నారు. ప్రస్తుతం ఎండలు మండుతున్నాయి. రోజురోజుకు ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. ఇంతటి వేడిలో దీక్షలు పాటించేందుకు కొందరు పెద్దలే వెనకడుగు వేస్తుంటే చిన్నారులు మాత్రం ధైర్యంగా రోజా ఉంటున్నారు. ప్రత్యేక ప్రార్థనలు, ఖురాన్ పఠనం చేస్తున్నారు. ఇఫ్తార్ వేళల్లో చిట్టి చేతులు ఎత్తి 'యా అల్లా.. మై రోజా రఖాహు.. ఇస్ కో ఖుబూల్ కర్లే.. మేరే గునాహ్ కో మాఫ్ కర్దే. ఔర్ ముఝే అచ్చి పఢాయి దే' అంటూ దువా చేస్తున్నారు.


కర్నూలు నగరంలోని ఓ మసీదులో ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న చిన్నారులు

రోజా ఉంటే పుణ్యమట


రంజాన్ నెలలో ఉపవాసం ఉంటే పుణ్యం అధికంగా వస్తుందని మా నాన్నమ్మ చెబుతుంది. ప్రతి సంవత్సరం రోజాలు ఉంటారు. నేను కూడా ఈ సారి నెల ఉపవాసాలు ఉంటున్నా. గతే ఏడాది మూడు రోజాలున్నా.

– షేక్ మొహమ్మద్ మగ్దూమ్, కర్నూలు

నాకు ఇష్టమైన మాసం


రంజాన్ అంటే నాకు ఎంతో ఇష్టం. రోజూ ఐదు పూటల నమాజ్‌తో పాటు ఉపవాసాలు ఉంటాను. మంచి చెడు గురించి తెలుసుకుంటాను. స్నేహితులతో కలిసి అస్సలాత్ చెబుతా. ఆధ్యాత్మికంగా గడుపుతా.

– సయ్యద్ రిహాన్, ఆలూరు

ఆకలి దప్పికలు గుర్తుకు రావు


రోజా ఉండడం గత ఏడాది నుంచి అలవాటు చేసుకున్నా. అల్లాపై భరోసాతో దీక్షలు చేస్తున్నప్పుడు ఆకలి, దప్పికలు గుర్తుకు రావు. ఎండలు అధికంగా ఉన్నప్పుడు కాస్త జాగ్రత్త పడితే చాలు. ఈ ఏడాది కూడా అన్ని రోజాలు ఉండాలనుకుంటున్నాను.

– పి. మొహమ్మద్ నఫీస్, ఎమ్మిగనూరు

కుటుంబ సభ్యులతో కలిసి


రంజాన్ నెల వచ్చిందటే మా కుటుంబసభ్యులందరూ ఉపవాసాలు ఉంటారు. వారితో పాటు నేను కూడా మూడేళ్ల నుంచి దీక్షలు పాటిస్తున్నా. తెల్లవారుజామున నుంచి సాయంత్రం వరకు ఏం తీసుకోను. – ఎస్.అఫ్షా, పాములపాడు

అల్లా దీవెనలతో..


రంజాన్ మాసంలో ఉపవాసాలు ఉండడం అలవాటు చేసుకున్నా. గత రెండుళ్లుగా రోజాలు పాటిస్తూ వస్తున్నా. ఎండలు ఎక్కువగా ఉన్నాయి. అయినా, అల్లా చల్లని దీవెనలతో దీక్షను కొనసాగిస్తున్నా.– లతీఫ్, కౌతాళం

మొదట్లో కొంత భయం


నేను నెల రోజుల పాటు రోజా ఉంటున్నాను. మొదట్లో కొంత భయంగా ఉండేది. ఉదయం నుంచి సాయంత్ర వరకు దీక్ష ఉండలేననుకున్నా. అల్లా దయతో ఉపవాసం ఉంటున్నా. – నవాజ్, వెల్దుర్తి

క్లుప్తంగా

పురుగు మందుల చట్టంపై అవగాహన పెరగాలి

కర్నూలు (అర్బన్): పురుగు మందుల చట్టం 1968, పురుగు మందుల నిబంధనల గురించి అవగాహన పెంచుకోవాలని సహాయ వ్యవసాయ సంచాలకులు ఎస్. వెంకటేశ్వర్లు అన్నారు. ఆదివారం స్థానిక జిల్లా వ్యవసాయాధికారి కార్యాలయ సమావేశ భవనంలో దేశీ ఇన్‌పుట్ డీలర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం మార్కెట్‌లో విక్రయిస్తున్న పురుగు మందులు, వాటి ఫార్ములేషన్స్, అడ్వాన్స్‌డ్ పురుగు మందుల ఫార్ములేషన్స్ గురించి తెలుసుకోవాలన్నారు. అలాగే రసాయన పురుగు మందులు, జీవ రసాయన పురుగు మందులు, బయోప్రొడెక్ట్స్‌పై అవగాహన పెరిగితే రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ఈ మందులకు సంబంధించిన పూర్తి సమాచారం డీలర్ల వద్ద ఉంటే పంటలకు సంబంధించి ఏ రకమైన మందులను వాడాలో రైతులకు తెలియజేసేందుకు వీలవుతుందన్నారు. శాశ్వత లైసెన్స్ మంజూరు గురించి వివరించారు.

14 నుంచి పాదయాత్రలు

కర్నూలు(సెంట్రల్) : కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా శంఖారావం పూరిస్తామని వామపక్ష పార్టీల నాయకులు ప్రకటించారు. ఆదివారం సుందరయ్య భవన్‌లో సీపీఎం, సీపీఐ జిల్లా కార్యదర్శులు డి.గౌస్‌దేశాయ్, బి.గిడ్డయ్య సమావేశమయ్యారు. వారు మాట్లాడుతూ. బీజేపీ అనుసరిస్తున్న విధానాలకు వ్యతిరేకంగా ఏప్రిల్ 14 నుంచి 30వ తేదీ వరకు పాదయాత్రలు చేపట్టనున్నట్లు తెలిపారు. బీజేపీ ప్రభుత్వం మతోన్మాద విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లి రెచ్చగొట్టే ధోరణిలో పనిచేస్తోందన్నారు. కేంద్ర ఆర్థిక విధానాలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు రామాంజనేయులు, జగన్నాథం, రసూల్ రామకృష్ణారెడ్డి, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి


దాదావలి (ఫైల్)

ఆస్పరి: ఆస్పరి సమీపంలో శనివారం రాత్రి స్కూటర్‌ను ఆటో ఢీకొట్టడంతో ఒకరు మృతి చెందినట్లు ఎస్‌ఐ వరప్రసాద్ ఆదివారం తెలిపారు. ఎస్‌ఐ తెలిపిన మేరకు వివరాలు.. మండలంలోని అట్టికల్లు గ్రామానికి చెందిన దాదావలి (45) ఆస్పరిలో టీవీ మెకానిక్‌గా పని చేస్తున్నాడు. శనివారం రాత్రి పని ముగించుకుని స్వగ్రామానికి స్కూటర్‌పై వెళ్తుండగా ఆస్పరి సమీపంలో బిల్లేకల్లు నుంచి వస్తున్న ఆటో ఢీకొట్టడంతో దాదావలికి తీవ్ర గాయాలు అయ్యాయి. కుటుంబ సభ్యులు వెంటనే ఆదోని ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతి చెందినట్లు ఎస్‌ఐ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

అన్నదానానికి విరాళం

మంత్రాలయం రూరల్: శ్రీకాకుళం జిల్లా నరసన్నపేటకు చెందిన నాగేశ్వరరావు శ్రీ రాఘవేంద్రస్వామి మఠంలో జరిగే అన్నదాన కార్యక్రమానికి లక్ష రూపాయలు విరాళం ఇచ్చారు. ముందుగా ఆయన గ్రామ దేవత మంచాలమ్మను, తర్వాత శ్రీరాఘవేంద్రస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. దాతకు శ్రీ మఠం అధికారులు స్వామి మెమెంటో, పరిమళ ప్రసాదం, వస్త్రం అందజేశారు.

డిజిటల్ సేవలు.. పరుగులు

- అంగన్‌వాడీ కేంద్రాల్లో స్మార్ట్ సేవలు
- అక్రమాలకు చెక్.. పారదర్శకతకు పెద్దపీట
- సూపర్‌వైజర్లు, కార్యకర్తలకు స్మార్ట్‌ఫోన్లు
- ఆరు ప్రత్యేక యాప్‌లతో కేంద్రాల నిర్వహణ

పూర్వ ప్రాథమిక విద్యనందిస్తున్న అంగన్‌వాడీ కేంద్రాల్లో డిజిటల్ సేవలు పరుగులు పెడుతున్నాయి. చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందుతున్న సేవల్లో అక్రమాలకు చెక్ పెడుతూ ప్రభుత్వం పారదర్శకతకు పెద్దపీట వేసింది. ఇందులో భాగంగా స్త్రీ, శిశు సంక్షేమ శాఖలో 'స్మార్ట్' సేవలకు శ్రీకారం చుట్టింది. – కోవెలకుంట్ల

కోవెలకుంట్ల ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో 180 అంగన్‌వాడీ, ఐదు మినీ అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. ఆయా కేంద్రాల్లో 13,275 మంది చిన్నారులు, గర్భిణులు, బాలింతలు లబ్ధి పొందుతున్నారు. లబ్ధిదారులకు అందించే పౌష్టికాహారం, ఆరోగ్యం, పారిశుధ్యం, తాగునీరు, తదితర మౌలిక వసతుల కల్పనలో ఎలాంటి లోటు పాట్లు, అక్రమాలకు తావులేకుండా ప్రత్యేక యాప్‌లు రూపొందించారు. యాప్‌ల నిర్వహణకు సంబంధించి ప్రాజెక్టు పరిధిలో ఉన్న ఆరుగురు సూపర్‌వైజర్లు, 185 మంది అంగన్‌వాడీ కార్యకర్తలకు స్మార్ట్ ఫోన్లను పంపిణీ చేశారు.

పారదర్శకతకు పెద్దపీట

అంగన్‌వాడీ కేంద్రాల్లో స్మార్ట్‌ఫోన్ల వినియోగంతో పారదర్శకమైన సేవలు అందనున్నాయి. ఆరు యాప్‌ల ద్వారా అన్ని రకాల సేవలు అందుబాటులోకి వచ్చాయి. చిన్నారులు, అంగన్‌వాడీ కార్యకర్తల హాజరు, స్టాక్ వివరాల యాప్‌లతోపాటు మరో నాలుగు యాప్‌ల ద్వారా సాంకేతికతో కేంద్రాలను నిర్వహిస్తున్నారు. అంగన్‌వాడీ కేంద్ర పరిసరాలు, పరిశుభ్రత వివరాలను శానిటేషన్ యాప్‌లో పొందుపరుస్తారు. పారిశుధ్యం లోపిస్తే ఆ సమాచారం సంబంధిత పంచాయతీ కార్యదర్శికి వెళ్తుంది. పారిశుధ్య సిబ్బంది అక్కడకు చేరుకుని పారిశుధ్య పనులు చేపడతారు. చిన్నారులు, బాలింతలు, గర్భిణులకు అందించే మధ్యాహ్న భోజనంలో నాణ్యత లోపిస్తే హాట్‌కుక్ యాప్‌లో వివరాలు నమోదవుతాయి. గ్రామ సచివాలయ మహిళా పోలీస్ అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించి మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేస్తారు. మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించని అంగన్‌వాడీ కేంద్ర వివరాలను యాప్‌లో నమోదు చేస్తారు. సంబంధిత అంగన్‌వాడీ కార్యకర్త, సూపర్‌వైజర్ నాణ్యమైన భోజనం అందించేందుకు కృషి చేయాలి. లేని పక్షంలో వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు తాగునీరు, మరుగుదొడ్లకు సంబంధించి వినియోగించుకునేందుకు నీరు అందుబాటులో ఉంచాలి. లేని పక్షంలో యాప్‌లో వివరాలు నమోదు చేస్తే సమాచారం ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ అధికారులకు చేరుతుంది. ఆ శాఖ అధికారులు యుద్ధప్రాతిపదికన నీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటారు. లబ్ధిదారులకు అందించే గుడ్ల సరఫరాకు ప్రత్యేక యాప్ అందుబాటులోకి వచ్చింది. ఆయా కేంద్రాలకు గుడ్ల ఏజెన్సీలు సక్రమంగా సరఫరా చేస్తున్నాయా, సైజు, నెలవారీ కోటా, స్టాంపింగ్, గుడ్ల నాణ్యత తదితర వివరాలు నమోదు చేయాల్సి ఉంది.


చిన్నారులకు ఆట వస్తువులతో విద్యబోధిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

పకడ్బందీగా పౌష్టికాహారం..

కోవెలకుంట్ల, కొలిమిగుండ్ల, సంజామల, ఉయ్యాలవాడ, దొర్నిపాడు మండలాల పరిధిలో సున్న నుంచి ఆరు నెలల్లోపు 1,319 మంది, ఆరు నెలల నుంచి ఏడాదిలోపు 1,200 మంది, 1–3 ఏళ్లల్లోపు 4,598 మంది, 3–6 ఏళ్లల్లోపు 3,438 మంది చిన్నారులతో పాటు 1,401 మంది గర్భిణులు, 1,319 మంది బాలింతలకు ప్రతిరోజు మధ్యాహ్న భోజనంతో పాటు కోడిగుడ్లు, పాలు, బాలామృతం, అటుకులు, రాగిపిండి, జొన్నపిండి, ఖర్జూరాలు, బెల్లం చిక్కీలతో కూడిన కిట్లను సరఫరా చేస్తున్నారు. పౌష్టికాహారం పకడ్బందీగా పంపిణీ చేసేందుకు రెండు ప్రత్యేక యాప్‌లు రూపొందించారు. పోషణ ట్రాకర్ యాప్‌లో ప్రతి రోజు చిన్నారులు, బాలింతలు, గర్భిణుల హాజరు నమోదు, చిన్నారుల ఎత్తు, బరువు కొలతలు, నమోదు చేయాల్సి ఉంది. వీటితోపాటు గృహ సందర్శన కార్యక్రమాల ద్వారా గర్భిణులు, బాలింతలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు ఐరన్ మాత్రల వినియోగంపై అవగాహన కల్పించి వివరాలను యాప్‌లో నమోదు చేయాల్సి ఉంది. వైఎస్సార్ సంపూర్ణ పోషణ యాప్ ద్వారా లబ్ధిదారులకు అందించే పౌష్టికాహారం, చిన్నారుల్లో లోప పోషణ, ఎత్తు, బరువులు, పిల్లల శారీరక, మానసిక అభివృద్ధి, తదితర వివరాలు పొందుపరుస్తున్నారు. కేంద్రాలకు సరఫరా అయిన పౌష్టికాహారం, గుడ్లు, పాలు, తదితర స్టాక్ వివరాలు, నెలవారి రిపోర్టులు నమోదు చేస్తున్నారు.


అంగన్‌వాడీ కేంద్రంలో మధ్యాహ్న భోజనం చేస్తున్న చిన్నారులు

మా పిల్లలను అంగన్‌వాడీ కేంద్రానికి పంపిస్తున్నా


పట్టణంలోని ఎల్‌ఎం కాంపౌండ్‌లో ఉన్న అంగన్‌వాడీ కేంద్రానికి మా ఇద్దరి పిల్లలను పంపిస్తున్నాం. అక్కడ మధ్యాహ్నం నాణ్యమైన భోజనం పెడుతున్నారు. బొమ్మలు, ఆటపాటలతో చదువు చెబుతుండటంతో పిల్లలు కూడా ఇష్టంతో వెళ్తున్నారు.

– హేమలత, కోవెలకుంట్ల

ఆహారం, ఆరోగ్యంపై శ్రద్ధ


అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు అన్ని పోషకాలతో కూడిన ఆహారం అందజేస్తున్నాం. చిన్నారులు, తల్లుల ఆరోగ్య విషయాలను ఎప్పటికప్పుడు స్మార్ట్‌ఫోన్‌లో వివరాలు నమోదు చేస్తున్నాం. పోషక లోపాలు ఉన్న పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ చూపిస్తున్నాం.

– వరలక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్త, కలుగొట్ల

అంగన్‌వాడీల్లో స్మార్ట్ సేవలు


అంగన్‌వాడీ కార్యకర్తలతోపాటు సూపర్‌వైజర్లకు స్మార్ట్ ఫోన్లు పంపిణీ చేశాం. అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారుల హాజరు నుంచి వారి ఆరోగ్యం, పరిశుభ్రత, సంపూర్ణ పోషణ, తదితర అన్ని రకాల సేవలు స్మార్ట్‌ఫోన్ల ఆధారంగా కొనసాగుతున్నాయి.

– పద్మావతి, ఏసీడీపీఓ, కోవెలకుంట్ల

కళాయజ్ఞంలో కోటేష్‌కు అవార్డు

నంద్యాల(అర్బన్): నంద్యాలకు చెందిన ప్రముఖ చిత్రకారుడు చింతలపల్లె కోటేష్ కళాయజ్ఞం ఆర్ట్ ఛాలెంజ్‌లో అవార్డు అందుకున్నారు. హైదరాబాద్‌లోని నెహ్రూ ఆర్ట్ గ్యాలరీలో ఈనెల మార్చి 31 నుంచి ఏప్రిల్ 1, 2 తేదీల్లో జరిగిన అంతర్జాతీయ చిత్ర కళా ప్రదర్శన పోటీల్లో కోటేష్ చిత్రించిన గోమాత విలాపం ఉత్తమ చిత్రంగా ఎంపికైంది. ఈ గ్యాలరీని వేలాది మంది చిత్ర కళాభిమానులు తిలకించారు. ఆదివారం నెహ్రూనగర్ ఆర్ట్ గ్యాలరీలో జరిగిన కార్యక్రమంలో ప్రసిద్ధ చిత్రకారులు శేషబ్రహ్మం, ఎంవీ రమణారెడ్డి చేతుల మీదుగా హైలీ కమాండబుల్ అవార్డును కోటేష్ అందుకున్నారు. కోటేష్ అవార్డు తీసుకోవడం పట్ల నంద్యాల చిత్రకారులు సుంకన్న, ఓబులేసు, రాముడు, వాసు, తదితరులు అభినందించారు.




అవార్డు అందుకుంటున్న కోటేష్(ఇన్‌సెట్) గోమాత విలాపం చిత్రం

నంద్యాలలో టీటీడీ ఏసీ కల్యాణ మండపం

నంద్యాల: పట్టణంలోని టీటీడీ కల్యాణ మండపాన్ని పునః నిర్మించి, పూర్తిగా ఏసీ సౌకర్యం కల్పించేందుకు తిరుమల తిరుపతి దేవస్థానం చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి రూ.9 కోట్లు మంజూరు చేశారు. నంద్యాల శ్రీనివాస నగర్‌లో రెండు ఎకరాల స్థలంలో ఉన్న కల్యాణ మండపం ప్రస్తుతం శిథిలావస్థకు చేరుకుంది. అంతేకాకుండా తగ్గులో ఉండటంతో వర్షం వచ్చినప్పుడు నీరు చేరుతుండటంతో అందులో శుభకార్యాలు నిర్వహించేందుకు ప్రజలు ముందుకు రావడం లేదు. నంద్యాల ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి కల్యాణ మండపం పరిస్థితిని టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. దేవస్థానం పాలక మండలి సమావేశంలో తీర్మానం చేసి నంద్యాల నూతన కల్యాణ మండపానికి నిధులు మంజూరు చేస్తూ ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు నంద్యాల ఎమ్మెల్యే శిల్పా రవి తిరుపతిలో టీటీడీ చైర్మన్‌ను కలిసి కృతజ్ఞతలు తెలిపారు.


టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డిని కలిసి కృతజ్ఞతలు తెలుపుతున్న ఎమ్మెల్యే శిల్పారవి

సమసమాజానికి నాంది 'మాలపల్లి'


కృష్ణమూర్తి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సాహితీ వేత్తలు

కర్నూలు కల్చరల్: సమసమాజానికి నాంది పలికిన నవల 'మాలపల్లి' అని ప్రసిద్ధ సాహితీ వేత్త, ఎస్‌వీయూ పూర్వపు వైస్‌చాన్స్‌లర్ ఆచార్య కొలకలూరి ఇనాక్ అన్నారు. సాహితీ సదస్సు ఆధ్వర్యంలో ఆదివారం కేవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వంద సంవత్సరాల 'మాలపల్లి ' ఉన్నవ లక్ష్మీ నారాయణ నవలపై సాహితీ సదస్సు జరిగింది. ఎస్‌వీ కృష్ణమూర్తి జ్ఞాపకార్థం ఈ సదస్సును ఏర్పాటు చేశారు. ముఖ్య వక్తగా హాజరైన ఆయన మాట్లాడుతూ ఉన్నవ లక్ష్మీనారాయణ పీడిత జనాన్ని గురించి, అగ్రవర్ణాల దోపిడీ గురించి మాలపల్లి నవలలో చిత్రీకరించారన్నారు. సమసమాజాన్ని కోరుకుంటూనే విప్లవ భావాలు కలిగిన రచనలు చేశారన్నారు. క్లస్టర్ యూనివర్సిటీ వీసీ, ప్రొఫెసర్ డి.వి.ఆర్. సాయిగోపాల్ మాట్లాడుతూ గాంధీజీ ప్రభావం, ప్రజా స్వామిక భావజాలంతో పాటు రష్యా బోల్షివిక్ విప్లవ ప్రభావం మాలపల్లి నవలమీద ఉందన్నారు. సాహితీ సదస్సు అధ్యక్షుడు కురాడి చంద్రశేఖర కల్కూర అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సదస్సు కార్యదర్శి జేఎస్ఆర్కే శర్మ, సభ్యులు సుబ్రహ్మణ్యం, లక్ష్మయ్య, శ్రీధర్‌మూర్తి, హరిశ్చంద్రారెడ్డి, కృష్ణమూర్తి, రాజన్న, లత, జయసుశీల, తదితరులు పాల్గొన్నారు.

రామాపురంలో భారీ చోరీ

- 63 తులాల బంగారు, రూ.14లక్షల నగదు అపహరణ
- ఇంటికి తాళం వేసి తిరుమలకు వెళ్లగా ఘటన

అవుకు: మండల పరిధిలోని రామాపురం గ్రామంలోని ఓ ఇంట్లో ఆదివారం భారీ చోరీ జరిగింది. రూ. 14 లక్షల నగదు, 63 తులాల బంగారు ఆభరణాలు ఎత్తుకెళ్లారు.పోలీసులు, బాధితుడు తెలిపిన వివరాల మేరకు... రామాపురం గ్రామానికి చెందిన మల్లు వెంకటేశ్వర రెడ్డి శనివారం వేకువజామున ఇంటికి తాళం వేసి కుటుంబ సమేతంగా వెంకటేశ్వర స్వామి దర్శనం కోసం తిరుమలకు బయల్దేరారు. గమనించిన దొంగలు శనివారం అర్ధరాత్రి ఇంటి కాంపౌండ్ గోడను దూకి ప్రధాన వాకిలికి వేసిన తాళాన్ని పగులగొట్టారు. తర్వాత ఇంట్లోకి చొరబడి బీరువాను పగులగొట్టారు. అందులో రూ.15 లక్షలు నగదు, 63 తులాల బంగారు ఉండగా దొంగలు హడావుడిలో లక్ష రూపాయలు అక్కడే వదిలేసి రూ.14 లక్షల నగదు, బంగారు ఆభరణాలతో ఉడాయించారు. తిరుమలకు వెళ్లిన వెంకటేశ్వర రెడ్డి ఆదివారం ఉదయం తన గుమాస్తాకు ఫోన్ చేసి ఓసారి ఇంటికెళ్లి చూసిరమ్మని చెప్పాడు. అతను వెళ్లి చూడగా ఇంటి తాళాలు పగులగొట్టి ఉండటంతో వెంటనే యజమానికి సమాచారం అందించాడు. తర్వాత చోరీ విషయం తెలుసుకున్న డోన్ డీఎస్పీ శ్రీనివాసరెడ్డి బనగానపల్లె సీఐ సుబ్బరాయుడు, ఎస్‌ఐలు రామిరెడ్డి, జగదీశ్వర్ రెడ్డితో కలిసి గ్రామానికి చేరుకొని ఇంటిని పరిశీలించారు. క్లూస్‌టీం ద్వారా ఫింగర్ ప్రింట్స్ సేకరించారు. తిరుమల నుంచి ఇంటికి చేరుకున్న వెంకటేశ్వరరెడ్డి ఇంట్లో పెట్టిన సొమ్ము వివరాలు పోలీసులకు తెలిపారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు అవుకు ఎస్‌ఐ జగదీశ్వర్ రెడ్డి తెలిపారు.


దొంగతనం జరిగిన ప్రదేశాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

పదవ తరగతి విద్యార్థిని ఆత్మహత్యాయత్నం

సంజామల(కోవెలకుంట్ల): సంజామల మండలం ఎగ్గోని గ్రామానికి చెందిన పదవ తరగతి విద్యార్థిని ఆదివారం రాత్రి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. కుటుంబ సభ్యులు అందించిన సమాచారం మేరకు.. గ్రామానికి చెందిన శివనారాయణ కుమార్తె శ్రావణి సంజామల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి చదువుతోంది. సోమవారం నుంచి పరీక్షలు ప్రారంభం కానున్నాయి. బాగా రాయకుంటే ఫెయిల్ అవుతానేమోనని భయపడి క్రిమి సంహారక మందు తాగింది. తల్లిదండ్రులు గమనించి చికిత్స నిమిత్తం కోవెలకుంట్ల ఆసుపత్రికి తీసుకెళ్లారు. ప్రస్తుతం విద్యార్థిని ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది.